క్లుప్తంగా

పట్టణాభివృద్ధికి సమష్టిగా కృషి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలపై వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా రూ.3.50 కోట్లతో 24 రకాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కమిషనర్ ఈవీ రమణబాబు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

కొమరోలు: మండలంలోని పోసుపల్లె గ్రామంలో సోమవారం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను కరవడంతో ఇద్దరికి స్వల్పంగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కొమరోలు, గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలకు తరలించి చికిత్స అందించారు.

అర్జీలు పరిష్కరించండి

- తహసీల్దార్లను ఆదేశించిన సబ్ కలెక్టర్

మార్కాపురం టౌన్: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 16 అర్జీలు సమర్పించారు. సమస్యల పూర్వాపరాలను అధికారులకు వివరించి న్యాయం చేయాలని కోరారు.

పామూరుపల్లె ఎస్సీపాలెంలో నీటి సమస్య



మరమ్మతులకు గురైన మంచినీటి బోరు

కొమరోలు: మండలంలోని పామూరుపల్లె ఎస్సీపాలెంలో తాగునీటి సమస్య నెలకొంది. ఎస్సీపాలెంలో ఉన్న మంచినీటి బోరు ఆదివారం రాత్రి మరమ్మతులకు గురైనా గ్రామ పంచాయతీ అధికారులు సోమవారం సాయంత్రం వరకు స్పందించలేదని స్థానికులు ఆరోపించారు. తాగునీటితోపాటు వాడుక నీటికీ అవస్థలు పడుతున్నామని, సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మదార్‌వలి

పొదిలి: దివ్యాంగుల సంక్షేమ జిల్లా కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రవితేజ అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని నవ్యాంధ్ర వికలాంగ హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ముల్లా మదార్‌వలి కోరారు. ఈ మేరకు కనిగిరిలో కలెక్టర్ రాజాబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న రవితేజ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో అక్రమాలకు పాల్పడినట్లు అర్జీలో పేర్కొన్నారు. సంతపేట బాలుర వసతిగృహంలో ఇన్‌చార్జ్ వార్డెన్‌గా పనిచేస్తూ పలు అక్రమాలకు పాల్పడ్డారని వివరించారు. ఆయన అవినీతిపై పూర్తి స్థాయిలో విజిలెన్స్ విచారణ జరిపించాలని మదార్‌వలి కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పి.చంద్రశేఖర్, కె.రంగస్వామి, మందల కృష్ణ, కె.వెంకటేశ్వర్లు, సయ్యద్ సుబానీ తదితరులు ఉన్నారు.

ప్రమాదమండి.. కాస్త జాగ్రత్తండి!

కొనకనమిట్ల: సమయానికి బస్సుల్లేకపోవడం.. గమ్య స్థానాలకు త్వరగా చేరుకోవాలన్న తాపత్రయం ప్రయాణికులను ప్రమాదంలోకి నెడుతోంది. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కుతుండటంతో నాలుగు రూపాయలు చేతికొస్తాయన్న ఆశతో డ్రైవర్లు కూడా అడ్డు చెప్పడం లేదు. అసలే మహిళలకు ఉచిత బస్సు పేరుతో తమ కొట్టారని కూటమి సర్కారుపై ఆగ్రహంతో రగిలిపోతున్న ఆటోవాలాలు.. జీవనోపాధి కోసం పోరాడుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండటంతో కూలీలు తమ సమీప గ్రామాలకు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. సోమవారం గొట్లగట్టు వద్ద ఓ ఆటోలో మహిళా కూలీలు ఇలా ప్రమాదకర రీతిలో ప్రయాణిస్తూ కనిపించారు.



ప్రమాదకరంగా కూలీలతో వెళుతున్న ఆటో

రెడ్ బుక్ కుట్రలపై బ్రహ్మాస్త్రం

డిజిటల్ బుక్

- కూటమి నాయకుల వేధింపుల బాధితులకు బాసటగా వైఎస్సార్ సీపీ
- అధికారులు, కూటమి నాయకులు ఇబ్బంది పెడితే యాప్‌లో నమోదు చేయండి
- డిజిటల్ బుక్ ఆవిష్కరణ సభలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న అన్నా రాంబాబు, పక్కన షంషేర్ ఆలీబేగ్ తదితరులు

మార్కాపురం:

రెడ్ బుక్ పేరుతో వైఎస్సార్ సీపీ శ్రేణులపై కూటమి నాయకులు చేస్తున్న దాడులు, దౌర్జన్యాలు, అధికారుల పక్షపాత ధోరణి, అక్రమ కేసులకు భవిష్యత్‌లో దీటైన సమాధానం ఇచ్చేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ఏర్పాటు చేశారని ఆ పార్టీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతోపాటు ప్రజలు డిజిటల్ బుక్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. సోమవారం సాయంత్రం మార్కాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ టీడీపీ నేతలు రెడ్‌బుక్ పేరుతో ఏడాదిన్నర కాలం నుంచి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ, అరెస్టులు చేయిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో కార్యకర్తలకు అండగా ఉండేందుకు డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. కూటమి నాయకుల అక్రమాలు, బెదిరింపులు, అక్రమ కేసులను క్యూఆర్ కోడ్ ద్వారా యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే బాధితుల ఫిర్యాదులపై విచారణ చేపట్టి చట్టపరంగా న్యాయం చేయడంతోపాటు తప్పుగా ప్రవర్తించిన కూటమి నేతలు, అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుంటారని వివరించారు. బాధితులందరికీ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధికార మదంతో పేట్రేగుతున్న వారిని వదిలేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో అన్నా కృష్ణచైతన్య, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సలీమ్, మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల ఎంపీపీలు లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మురళీకృష్ణ యాదవ్, మార్కాపురం, కొనకనమిట్ల జెడ్పీటీసీ సభ్యులు నారు బాపన్‌రెడ్డి, అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్లు మురారి వెంకటేశ్వర్లు, మోరా శంకర్‌రెడ్డి, యార్డు మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి జి.సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు డాక్టర్ చప్పిల్లి కనకదుర్గ, కొత్త కృష్ణ, సిరాజ్, చాటకొండ చంద్ర, ఉత్తమ్‌కుమార్, రోజ్‌లిడియా, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు గాయం శ్రీనివాసరెడ్డి, గౌస్ మొహిద్దీన్, చాంద్‌బాషా, ఉస్మాన్, గురవయ్య, సతీష్, అమీరుల్లాఖాన్, మల్లయ్య, నాలి కొండయ్య, తుమ్మా వెంకటరెడ్డి, నల్లబోతుల కొండయ్య, వేల్పుల చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



టీబీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మార్కాపురం: క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సోమవారం టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగ నిరోధకశక్తి తక్కువ ఉన్నవారు, బరువు తక్కువ ఉన్నవారు, ఊపిరితిత్తుల సమస్య ఉన్నవారు తప్పనిసరిగా కళ్లె పరీక్ష చేయించుకోవాలని సూచించారు. క్షయ నిర్ధారణ అయితే ప్రభుత్వం ఉచితంగా మందులు ఇస్తుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే యంత్రంతో మొబైల్ ఎక్స్‌రేలు తీశామని, 90 మందికి టీబీ పరీక్షలు చేశామని వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ వి.ప్రదీప్ కుమార్, ఎస్‌టీఎస్ పి.గోవిందరాజులు, హెచ్‌వీ పి.లక్ష్మీరెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ మోతడిక వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ స్నేహం.. అపూర్వం



అపూర్వ సమ్మేళనంలో నారాయణరెడ్డిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గిద్దలూరు రూరల్:

మండలంలోని పాదలకుంటపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98లో 10వ తరగతి చదివిన విద్యార్థులు సోమవారం అదే పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు దస్తగిరి, వీరంరెడ్డి కృష్ణమోహన్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డితోపాటుగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమణారెడ్డి, జనార్దన్‌రెడ్డి, అనుపమ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించాలి

- రాచర్ల సర్వసభ్య సమావేశంలో అధికారులకు ఎంపీపీ సూచన
- యూరియా కొరత వాస్తవమేనన్న వ్యవసాయాధికారి
- తాగునీరు, రోడ్లు, పింఛన్లపై ప్రశ్నించిన సభ్యులు



మానసిక వికలాంగుడి పింఛను నిలిపివేతపై ప్రశ్నిస్తున్న అనుములవీడు సర్పంచ్ రమేష్

రాచర్ల: గ్రామాల్లో ప్రధాన సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ షేక్.ఖాశింబి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖపై సమీక్ష సందర్భంగా చినగానిపల్లె సర్పంచ్ పడగాల రమేష్ మాట్లాడుతూ.. యూరియా లేకపోవడంతో మొక్కజొన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. రైతుకు రెండు బస్తాల యూరియా ఇస్తే.. పది ఎకరాలు సాగు చేసిన వారి పరిస్థితి ఏమిటని అధికారులను ప్రశ్నించారు. దీనిపై ఏఓ షేక్.మహబూబ్‌బాషా స్పందిస్తూ యూరియా కొరత ఉన్న మాట వాస్తవమేనని, నానో యూరియా వాడుకోవాలని చెప్పారు. రాచర్ల ఎస్సీ కాలనీలో తాగునీటి పైపులైన్ వాల్వ్ తొలగించడంతో కొన్ని గృహాలకు నీరు సరఫరా కావడం లేదని ఎంపీటీసీ చిట్టెం ఎలిశమ్మ సభ దృష్టికి తీసుకొచ్చారు. కొద్దిపాటిగా వచ్చే తాగునీటిని కొందరు ఇష్టారాజ్యంగా చెట్లకు మళ్లిస్తున్నారని వివరించారు. అనుములపల్లె స్కూల్లో ఆర్వో ప్లాంట్ పనిచేయక విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బస్‌స్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు చేరి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామ సర్పంచ్ రమేష్ సభలో ప్రస్తావించారు. అనుములపల్లె గ్రామానికి చెందిన బొర్రా వంశీ అనే యువకుడికి వందశాతం మానసిక వికలాంగ సర్టిఫికెట్ ఉన్నప్పటికీ సెప్టెంబర్ నెలలో పింఛను ఇవ్వలేదని అతని తండ్రి బాలవెంకటేశ్వర్లు సమావేశం మధ్యలో అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నాడు. దీనిపై ఎంపీడీఓ వెంకటరామిరెడ్డిని సర్పంచ్ రమేష్ ప్రశ్నించగా.. తన చాంబర్‌లో మాట్లాడదామని సమాధానమిచ్చారు. సమావేశంలో మండల కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ ఖాదర్‌బాషా, ఎంఈఓలు వారణాసి గిరిధర శర్మ, షేక్ మెయినుద్దీన్, విద్యుత్‌శాఖ ఏఈ బాలగురవయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి

- సచివాలయ ఉద్యోగుల నిరసన

పొదిలి: విధి నిర్వహణలో తీవ్ర పని ఒత్తిడి ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పని భారం తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. యూనియన్ నాయకులు సుబ్బారావు, అనూష మాట్లాడుతూ.. పింఛన్ల పంపిణీ సమయం కుదించి లిమిటెడ్ టైమ్ నిబంధన పెట్టడంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నామన్నారు. పీ–4 ఇంటింటి సర్వే కేటాయించవద్దని, ఆరేళ్లు పూర్తయిన ఉద్యోగులకు ఏఏఎస్ అమలు చేయాలని, బదిలీల్లో పారదర్శకత పాటించాలని కోరారు. ప్రమోషన్ చానల్, జాబ్ చార్ట్ విషయంలో ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు విడతల వారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని నగర పంచాయతీ కార్యాలయ అధికారులకు అందజేశారు.

కంభంలో భారీ వర్షం



సోమవారం రాత్రి కంభంలో వర్షం కురుస్తున్న దృశ్యం

కంభం: కంభం పట్టణంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో అధికంగా ఉండగా సాయంత్రానికి వాతావరణం చల్లబడింది. వర్షం ధాటికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో వర్షం నీరు, మురుగు కలిసిపోయి రోడ్లపై పోటెత్తడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. కందులాపురం గ్రామంలోని రామాలయం వద్ద నీరు వెళ్లే దారిలేక అక్కడే నిలిచిపోయాయి.

అంధకారంలో మార్కాపురం

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీలో గత కొన్ని రోజులుగా వీధిలైట్లు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక వైపు అకాల వర్షాలు.. మరో వైపు వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రివేళ ఇంటికి చేరుకునే క్రమంలో తంటాలు పడాల్సి వస్తోంది. పైగా రాత్రి వేళల్లో కుక్కల సంచారం ఎక్కువగా ఉండటంతో చీకట్లో ఏ క్షణాన మీదికొచ్చి కరుస్తాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్నిరోజులుగా వీధిలైట్లు వెలగడం లేదని ఫిర్యాదు చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.

మాజీ సర్పంచ్ మాతృమూర్తికి 'అన్నా' నివాళి



నారాయణమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని గర్రెవారి వీధిలో నివాసం ఉంటున్న కొమరోలు మండలం తాటిచెర్ల గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు బాదం గోపాల్ మాతృమూర్తి నారాయణమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సందర్శించి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కొమరోలు జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు, నాయకులు వెంగయ్యచౌదరి తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



కంభం చెరువుకట్టపై రాత్రిపూట మద్యం తాగుతున్న వ్యక్తికి కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్సై

కంభం: గ్రామ, పట్టణ శివార్లతో పాటు ఇతర బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని కంభం సీఐ కె.మల్లికార్జున హెచ్చరించారు. కంభం చెరువుకట్టపై, అదే మార్గంలోని బహిరంగ ప్రదేశాల్లో రాత్రి వేళల్లో మద్యం తాగుతున్న వారిని గుర్తించి ఎస్సై నరసింహారావుతో కలిసి కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం మత్తులో వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సరస్వతీ నమస్తుభ్యం



రాచర్లలో అలంకరణలో సరస్వతిదేవి అమ్మవారు



బేస్తవారిపేట : ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ



గిద్దలూరు కాళికామాత ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



బేస్తవారిపేట : సరస్వతీదేవిగా వాసవీమాత



అర్ధవీడులో సరస్వతి మాత అలంకరణలో..

సాక్షి నెట్‌వర్క్: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో అమ్మవారి మూలవిగ్రహమూర్తులను సరస్వతీదేవిగా, విద్యాలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు. కాళరాత్రి రూపంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పలు ఆలయాల్లో చండీయాగం, రుద్రయాగం, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు పర్యవేక్షించారు. మంగళవారం దుర్గాష్టమి వేడుకలకు ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు.



పొదిలిలో సరస్వతిదేవి అలంకరణలో అమ్మవారు



మార్కాపురం : ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో విద్యాలక్ష్మి అలంకారంలో..



మార్కాపురం : కాళరాత్రి అలంకారంలో జగదాంబ అమ్మవారు



మార్కాపురంలో సరస్వతిదేవిగా వాసవీమాత



కొమరోలులో గ్రామోత్సవంలో కలశాలతో మహిళలు



బేస్తవారిపేట : సరస్వతిదేవిగా చౌడేశ్వరీదేవి



మార్కాపురంలో సరస్వతీదేవి అలంకారంలో రాజ్యలక్ష్మి అమ్మవారు



అర్ధవీడులో అమ్మవారి గ్రామోత్సవం

నోటీసు

మహా రాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
H.M.O.P. 87/2025

నాగిరెడ్డి అశోక్ కుమార్ రెడ్డి .... పిటీషనరు
Vs
కొండా మౌనిక @ నాగిరెడ్డి మౌనిక .... రెస్పాండెంటు

టు :
కొండా మౌనిక @ నాగిరెడ్డి మౌనిక, భర్త: నాగిరెడ్డి అశోక్ కుమార్ రెడ్డి, తండ్రి కొండా భాస్కర్ రెడ్డి, వయస్సు: 27 సంవత్సరములు, హిందూ, నివాసం : డోర్ నెం.8-17-175-13, సంజీవరెడ్డి నగర్, హెచ్.డి.ఎఫ్.సి, బ్యాంక్ ఎదురుగా, గిద్దలూరు టౌన్ మరియు మండలం, ప్రకాశం జిల్లా.
ప్రస్తుత నివాసం : భాషా నగర్, ఎస్.ఎమ్.కె. గ్రానైట్స్ అండ్ మార్బుల్స్ ఎదురుగా, పవర్ ఆఫీసు దగ్గర, గిద్దలూరు టౌన్ మరియు మండలం, ప్రకాశం జిల్లా.
ప్రస్తుత నివాసం : ఇ-బ్లాక్ 2302, కె.పి.హెచ్.బి., ఆర్.టి.ఓ. ఆఫీసు దగ్గర, కూకట్‌పల్లి, సి.పి. వన్ సిటీ, హైదరాబాద్, తెలంగాణ, పిన్ కోడ్ : 500 072.
సెల్ నెం.: 84648 76217, 99599 86454.

పై నెంబరు H.M.O.P. లోని పిటీషనరుకు నీవు భార్యవై ఉన్నందున, నీ నుండి విడాకులు మంజూరు చేయమని కోరుతూ పిటీషనరు నీ పైన పై కోర్టులో, పై నెంబరు H.M.O.P.ని దాఖలు చేసినందున, ఇందు విషయమై నీకు పలుమార్లు నోటీసులు పంపగా, అవి నీకు ముట్టని కారణము చేత, ఈ దినపత్రిక నోటీసు ద్వారా నీకు తెలియజేయునది ఏమనగా **17-10-2025వ తేదీన** పై కోర్టులో ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై నీకు ఏమైనా అక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకొనవలసినది. లేని యెడల నీ పరోక్షమందు H.M.O.P. పిటీషనును విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వు మేరకు //

వాయిదా : 17-10-2025
మార్కాపురం.

ఎమ్.కాశీశ్వరరావు, పిటీషనరు తరపు అడ్వకేట్
మార్కాపురం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
సెల్:9391754698, 9618087029, 9618087029.